క్లుప్తంగా

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన



ఇస్తెమా ఏర్పాట్లు పరిశీలిస్తున్న బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో మార్చి 3,4వ తేదీల్లో జరగనున్న ఇస్తెమా ఏర్పాట్లను సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ పరిశీలించారు. ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధమన్నారు. ముస్లిం సోదరులకు అసౌకర్యం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఇస్తెమా నిర్వహించుకునేందుకు అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

పుట్టపర్తి అర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి పెనుకొండ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఉద్యోగులు రూ.50 వేల విరాళాన్ని సోమవారం కలెక్టర్ బసంత్‌కుమార్‌కు కలెక్టరేట్‌లో అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున జిల్లా ప్రజలకు విస్తృత సేవలు అందించడానికి విరాళాలు అందజేయాలన్నారు. రక్త నిధి, జన ఔషధి దుకాణాలు, ఐ బ్యాంకు, మాతా శిశు సంరక్షణ తదితర కార్యక్రమాలను చేపట్టేందుకు విరాళాలు అవసరమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ పేరుమీద ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు ఖాతా నంబర్ 110092922521, ఐఎఫ్ఎస్‌సీ సీఎన్ఆర్‌బీ 0002351కు విరాళాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ మురళీ మోహన్, డీఈలు లోకన్న, వెంకటరమణ, పద్మావతి, హరిక్రిష్ణ, మధుసూద, శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, సభ్యులు బయారెడ్డి, డాక్టర్ రాజా, కో ఆర్డినేటర్ రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గాండ్లపెంట: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ తాతం జగన్మోహన్ సూచించారు. మండల పరిధిలోని మలమీదపల్లి సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెరికల్చర్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి గైర్హాజరైనట్లు గుర్తించారు. డుమ్మా కొట్టిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ హెచ్చరించారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: కరాటే పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అభినందించారు. ఆర్డీటీ తరఫున భూపాల్‌లో జరిగిన సెకండ్ ఖేలో ఆల్ ఇండియా ఉమెన్స్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని మైనస్ 32 కేజీ విభాగంలో సాయిప్రియ ర్యాంకింగ్ మెడల్ సాధించింది. ఇంకా పలువురు విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ఇనాయత్‌బాషా, పీఈటీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పుట్టపర్తి టౌన్: చెట్టుకు ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం పుట్టపర్తి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఓడీచెరువు మండలం శేషయ్యగారిపల్లికి చెందిన వడ్డె నారాయణప్ప (70) స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో కుమార్తె దగ్గర ఉంటూ హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం హిందూ శ్మశాన వాటికలో వైరుతో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోపి

ఓడీ చెరువు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపి అన్నారు. మండలంలోని వనుకువారిపల్లిలో సోమవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు పాస్‌బుక్‌ల వివరాలు ఇవ్వరాదన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే తమకు సమాచారమివ్వాలన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్యాధునిక హంగులతో కదిరి బస్టాండ్

- 16 ప్లాట్ ఫాంల ఏర్పాటుకు ప్రణాళికలు
- రద్దీకి అనుగుణంగా అధికారుల చర్యలు
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు



కదిరి ఆర్టీసీ బస్టాండ్

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు త్వరలో మారనున్నాయి. అత్యాధునిక సదుపాయాలు, అన్ని హంగులతో నూతన బస్టాండ్ నిర్మించేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదివరకే కదిరి బస్టాండ్‌లో పారిశ్రామికవేత్తలతో జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్, సివిల్ ఇంజనీర్ సురేంద్రబాబు సమావేశం నిర్వహించారు. ప్రతిపాదనలు తెలియజేశారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి సలహాలు, సూచనలు తీసుకున్నారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి సుమారు రూ. 20 కోట్లు ఖర్చు కావచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. కదిరి డిపోతో పాటు జిల్లాలో పెనుగొండ డిపోకూడా ఆధునికీకరణ చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్ తెలిపారు.

16 ప్లాట్‌ఫాంల ఏర్పాటు..

ప్రస్తుతం అనంతపురం, మదనపల్లి, రాయచోటి, తలుపుల నాలుగు బస్టాండ్‌లు ఉన్నాయి. దీంతో ఏ బస్సు ఎక్కడికి వెళ్తుందో ఆ బస్టాండుకు వెళ్లి తెలుసుకోవాల్సి వచ్చేది. నూతన బస్టాండ్ నిర్మిస్తే మొత్తం ఒకే వరుసలో 16 ప్లాట్ ఫాంలు అందుబాటులోకి వస్తాయి. ప్రయాణికులకు ఇది సౌకర్యంగా ఉంటుంది. బస్టాండ్ కిందవైపు ప్లాట్‌ఫాంలు, పై అంతస్తులో డీఎం కార్యాలయం, తదితర గదులు నిర్మించనున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పబ్లిక్ ప్రయివేట్ పార్టిసిపేషన్ (పీపీపీ) పద్ధతిన నూతన హంగులతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించనున్నారు. 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఎమ్మెల్యే విశేష కృషి..

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్టాండ్‌ను విస్తరించాలని పలుమార్లు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కదిరి ప్రాంతం నుంచి వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు బస్సు సర్వీసులు కూడా నడపాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన అధికారులు బస్సు సర్వీసులను నడపడంతో పాటు బస్టాండ్ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇదీ కదిరి బస్టాండ్ ప్రస్థానం..

ప్రారంభం..	1978 మే నెల
అప్పట్లో బస్సులు	27
సిబ్బంది	112
ప్లాట్ ఫాంలు	5
ప్రస్తుతమున్న ప్లాట్‌ఫాంలు	7
బస్సులు	110
సిబ్బంది	476
నిత్యం కదిరి డిపోనకు బస్సు ట్రిప్పులు	550
బస్టాండ్ గుండా ప్రయాణించే వారు	6,500 మంది

చాలా సంతోషంగా ఉంది



సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ ప్రస్తుత ప్రయాణికుల అవసరాలకు ఏమూలకు సరిపోవడం లేదు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి కృషి, ప్రయాణికుల అభీష్టం మేరకు నూతన బస్టాండ్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషించదగ్గ విషయం. త్వరితగతిన బస్టాండ్‌ను ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఈశ్వర్‌రెడ్డి, కదిరివాసి

నూతన టెక్నాలజీతో నిర్మాణం



కదిరి డిపోలో షాపుల ద్వారా నెలకు రూ. 8 లక్షల ఆదాయం వస్తోంది. ఈ 8 లక్షలకు పైన ఎవరైతే బిడ్డింగ్ వేస్తారో వారికే పీపీపీ పద్ధతిలో బస్టాండ్ నిర్మాణం అప్పగిస్తాం. నూతన టెక్నాలజీతో బస్టాండ్ నిర్మించేందుకు నిధులు లేవు. అందుకే పీపీపీ పద్ధతిలో నిర్మించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. కదిరి, పెనుగొండ డిపోను పైలట్ ప్రాజెక్టులుగా చేపడుతున్నాం.

– మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

గ్రామాభివృద్ధికి తోడ్పడతాం

అమడగూరు: గ్రామాభివృద్ధికి తోడ్పడతామని అమడగూరు యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సభ్యులు జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలతో పాటుగా ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడుతూ ఇకనుంచి ప్రతి ఏడాది విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికతో పాటు పారితోషికం ఇస్తామన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంచడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున, ఇంజినీర్ సుమన్‌బాబు, కమిటీ అధ్యక్షుడు నాగార్జున, ఉపాధ్యాక్షుడు సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

'రవీంద్రరెడ్డిని గెలిపించాలి'



మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస హరినాథ్‌రెడ్డి కోరారు. పట్టణంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, కౌన్సిలర్లను కలిశారు. వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకాయల నరేష్, విశ్వేశ్వర్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా



లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసానిస్తోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో ఓడీ చెరువు మండలం లింగాలపల్లికి చెందిన శేఖర్ రెడ్డికి రూ.10 లక్షలు, కొండకమర్లకు చెందిన లబ్బుల్ కలామ్‌కు రూ.3 లక్షలు, కొత్తచెరువుకు చెందిన చాకలి నాగేంద్రకు రూ.3 లక్షలు, పోతులకుంటకు చెందిన నాగభూషణకు రూ.5 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల వైద్యం కోసం రూ. కోట్లు ఖర్చు చేశారన్నారు. వైద్యానికి ఆరోగ్యశ్రీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో పలువురు మృతుల కుటుంబీకులను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పరామర్శించారు. పుట్టపర్తి మండలం ఇరగరాజుపల్లి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గోవిందరెడ్డి, ఎనుములపల్లికి చెందిన పరమేష్, బ్రాహ్మణపల్లికి చెందిన పురుషోత్తం రెడ్డి, బ్రాహ్మణపల్లి తాండా వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణానాయక్, 2వ వార్డు పెద్ద బజారుకు చెందిన సోమశేఖర్, తారకరామనగర్‌లో జీమాను జ్యోతి కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

మారెమ్మను దర్శించుకొన్న ఎమ్మెల్యే

బ్రాహ్మణపల్లి తాండాలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన మారెమ్మ దేవాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయి లీల, సహకార సంఘం అధ్యక్షులు రుషీకేశవరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రామస్వామినాయక్, నారాయణస్వామి నాయక్, సతీష్‌నాయక్, విజయకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీల్లో కాంస్యం



కె. యస్విత

ధర్మవరం రూరల్: చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి జూడో చాంఫియన్ షిప్ పోటీల్లో చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారిణి కె.యస్వితా సబ్ జూనియర్ -28 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిందని వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం విజయసాయి తెలిపారు. పతకం సాధించిన క్రీడాకారిణిని సోమవారం వారు అభినందించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఎన్పీకుంట: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపాల్‌నాయక్, వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- 'గుడ్ మార్నింగ్ ధర్మవరం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం కోసమే 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో సోమవారం 'గుడ్‌మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. లోనికోట ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వైర్లు దగ్గరగా ఉండటంతో తరచూ సమస్యలు వస్తున్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సాంకేతిక లోపంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని పలువురు వాపోయారు. తమకు హౌసింగ్ బిల్లులు పడలేదని పలువురు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక లోపంతో బిల్లులు పడని వారికి వెంటనే సరి చేసి వచ్చేలా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ వైర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. కాలువపై మెట్లు కట్టడం గుర్తించిన ఎమ్మెల్యే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి, వార్డు ఇన్‌చార్జ్ తొండమాల రవి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలు సహించం

- డ్వామా పీడీ రామాంజనేయులు



సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. నల్లమాడ మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి చివరి వరకూ జరిగిన ఉపాధి హామీ పథకంలో రూ.22,797 అవినీతి జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ రామాంజనేయులు, అనంతపురం విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, కదిరి ఏపీడీ రెహానాబేగం, నల్లమాడ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, డీఆర్పీలు పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలో జరిగిన పనులు, క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన లోపాలను వివరించారు. నల్లమాడ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా 55 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఉపాధిహామీ పథకం, సోషల్‌ఫారెస్ట్, పంచాయతీరాజ్, స్కూల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో 888 పనులకు గాను రూ.12.46 కోట్లు పనులు జరిగాయి. ఫిబ్రవరి 6 నుంచి 19వ తేదీ వరకూ క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో కూలీలకు రూ.9.67 కోట్లు, మెటీరియల్‌కు రూ.2.79 కోట్లు ఖర్చు చేశారు. యర్రవంకపల్లి, చారుపల్లి, పాతబత్తలపల్లి, పులగంపల్లి, రెడ్డిపల్లి, గోపేపల్లి, నల్లమాడ, మసకవంకపల్లి, దొన్నికోట, వంకరకుంట, వేళ్లమద్ది పంచాయతీల్లో రూ.22,797 అవినీతి జరిగినట్లు గుర్తించి నిధుల రికవరీకి ఆదేశించారు. డ్వామా పీడీ రామాంజనేయులు, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి మాట్లాడుతూ రూపాయి అవినీతి కూడా జరగకూడదని ప్రభుత్వం చర్యలు చేపట్టినా కింది స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం మంచిది కాదన్నారు. గడువులోగా నిధుల రికవరీ జరగాలన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల 1987–88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పాఠశాలకు కుర్చీలు, ఇతర సామాగ్రి వితరణగా అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ 'నాడు–నేడు'తో విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. సీఎంను స్ఫూర్తిగా తీసుకుని మిత్ర బృందంతో కలిసి రూ.25 వేల విలువైన సామాగ్రి పాఠశాలకు అందించామన్నారు.

ఎన్‌జీఓ స్థలాన్ని పరిరక్షించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘం సభ్యులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా ఏపీ ఎన్‌జీఓ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని, దాన్ని పరిరక్షించాలని ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు కలెక్టర్ బసంత్‌కుమార్, ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌కు విడివిడిగా సోమవారం వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తి పట్టణం ఎనుములపల్లి గ్రామ పొలంలోని సర్వే నంబర్ 466లో ప్లాట్ నంబర్ 05లో 8 సెంట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలాన్ని పక్కనే ఉన్న లేట్ మునెప్ప కుమారులు వెంకటరాముడు, గొల్లశేఖర్, వెంకటేషులు భార్య గొల్ల అంజినమ్మ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దౌర్జన్యంగా ఆక్రమించిన స్థలాన్ని తమకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు లింగా రామమోహన్, కదిరి తాలూకా అధ్యక్షుడు వేణు, శ్రీధర్‌బాబు, మహిళా అధ్యక్షురాలు జమీలాబేగం తదితరులు ఉన్నారు.

వడ్డెర కులస్తుల సంబరాలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వడ్డెర కులస్తులు

కొత్తచెరువు: వడ్డెర కులస్తులు యేసు రత్నం,జయమంగళ వెంకటరమణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం పట్ల సంబరాలు మిన్నంటాయి. సోమవారం వడ్డెర కులస్తులు కొత్తచెరువులోని నాలుగురోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే అందరికీ సమన్యాయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ భాస్కర్, మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ ఉపసర్పంచ్ వెంకటరాముడు, డీలర్ శీన, పూజారి పెద్దన్న, తిరుపతేంద్ర, శీన, కిష్టప్ప, పెద్దన్న, ఫణిశేఖర్, చంద్రమౌళి, వెంకటేష్, కేశప్ప,చంద్రశేఖర్,గంగాద్రి,రమణ తదితరులున్నారు.

'మాట తప్పని నేత సీఎం జగన్'

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్ మాట తప్పని నేత అని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, రాష్ట్ర వడ్డెర్ల కార్పొరేషన్ డైరెక్టర్ ఉమా రాజు వేర్వేరు ప్రకటనల్లో కొనియాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో బీసీలకు పెద్దపీట వేశారని తెలిపారు. 18 స్థానాలకు 14 స్థానాల్లో బడుగు బలహీన వర్గాల వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించడం హర్షణీయమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబులా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తమ పార్టీ అధినేతకు తెలియదని, నిరంతరం బడుగుల కోసం తపిస్తూ రాజకీయ పదవులు కట్టబెట్టి సమాజంలో గౌరవం తీసుకొచ్చారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంగమ్మ ఎంపికపై హర్షం

నల్లమాడ: మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి ఎస్.మంగమ్మను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ దొన్నికోట నరసింహులు, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన మంగమ్మను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల పట్ల చిత్తశుద్ధిని మరోసారి చాటారని పేర్కొన్నారు.

రుణం రెన్యూవల్ చేసుకోండి

నల్లచెరువు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణానికి సంబంధించి మార్చి 15లోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని అధ్యక్షుడు కుర్లి జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

IN THE COURT OF THE I ADDL. DISTRICT JUDGE, ANANTHAPURAMU.
A.S. No. 6/2022

Between:
The Ananthapuramu District Coop-marketing Society Ltd. Ananthapuramu Rep. by its Business Manager, Ananthapuramu ...Appellant

And

1) Sri Lakshmi Venkateswara Rythu Seva Sangam, D.No. 27/25, Durga Nagar, Dharmavaram, Sri Sathya Sai District Rep. by its President A.Konda Reddy
2) Sri A.Konda Reddy, S/o A.N. Reddy, President, Sri Lakshmi Venkateswara Rythu Seva Sangam, D.No. 27/25, Durga Nagar, Dharmavaram, Sri Sathya Sai District ...Respondents

NOTICE TO RESPONDENTS (1) AND (2)

పైన నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము **06-03-2023 వ తేది ఉదయం 10-30 గంటలకు** వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

K. GUNDU RAO, VENKATA RAGHU KUMAR,
Advocates, Ananthapuramu.
Cell: 9490180631, 9985158438

కోడ్ తప్పండటంతోనే డబ్బు పడలేదు

- స్పష్టం చేసిన మహిళా సంఘాల సభ్యులు

కదిరి టౌన్: స్టేట్‌బ్యాంకు ప్రాడక్టు కోడ్ తప్పుగా నమోదు చేయడం వల్లే తమకు సున్నా వడ్డీ డబ్బు పడలేదని పలువురు మహిళా సంఘాల సభ్యులు స్పష్టం చేశారు. కదిరిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులైన 260 సంఘాలకు సున్నా వడ్డీ పడాల్సి ఉందన్నారు. 11 సంఘాల సభ్యులకు మాత్రమే వైఎస్ఆర్ సున్నా వడ్డీ పడినట్లు తెలిపారు. కాగా, బ్యాంకు అధికారుల తప్పిదంతోనే సున్నా వడ్డీ డబ్బు జమ కాలేదని మెప్మా టీఎంసీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. బ్యాంక్ పై స్థాయి అధికారులకు చెప్పినా ప్రాడక్టు కోడ్ తప్పుగా నమోదు చేయడం వల్లే తప్పిదం జరిగిందన్నారు. పై అధికారులు తప్పు చేసి తమపై నెట్టడం సరికాదన్నారు. మహిళా సంఘాల సభ్యులకు తమ వంతు సాయం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

'నరసింహారెడ్డి వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి'

పుట్టపర్తి టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఫిబ్రవరి 22న అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ గంగులకుంట నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రప్రభుత్వం ఇటీవల ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుమీద పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసిందని ప్రకటనలో తెలిపారు.